క్లుప్తంగా

గోసాలలో వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: గోసాలలో వ్యక్తి కనిపించకపోవడంతో పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గోసాల గ్రామానికి చెందిన గడ్డం మోహనరావు కుమారుడు వెంకటేశ్వరరావు ఆటోనగర్‌లో అట్టపెట్టల కంపెనీలో పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం వెంకటేశ్వరరావుకు పని ప్రదేశంలో ప్రమాదం జరిగి చేతికి గాయమైంది. దీంతో ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత గాయం తగ్గింది. అప్పటి నుంచి అతను అనారోగ్యంతో ఉంటున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి అందరూ నిద్ర పోయారు. తెల్లవారి కుటుంబ సభ్యులు చూడగా వెంకటేశ్వరరావు కనిపించలేదు. అతని కోసం బంధువుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేదు. దీంతో వెంకటేశ్వరరావు తండ్రి మోహనరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోజూ వ్యాయామం చేయాలి



పెనమలూరు: అధ్యాపకులు రోజూ వ్యాయామం చేయాలని వైద్యులు సూచించారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఫ్యాకల్టీకి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్ర ఆస్పత్రి, దుహిత ఆస్పత్రి, అమరావతి కంటి ఆస్పత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యాన ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో నార్త్, సౌత్ ఫౌండేషన్ సభ్యుడు వెంకటరత్నం, డాక్టర్ అచ్యుతరామయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పద్మావతి

పెనమలూరు: పెనమలూరు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పెదపులిపాక గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేస్తున్న వి.పద్మావతీదేవిని నియమించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఎస్వీ నాగేశ్వరనాయక్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. పెనమలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన కె.రాధాకృష్ణ పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో పెదపులిపాక గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేస్తున్న వి.పద్మావతిదేవిని ఇన్‌చార్జ్ కార్యదర్శిగా(ఎఫ్ఏసీ)గా నియమించారు.

వరప్రదాయిని.. వరలక్ష్మి

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



పెదపులిపాకలో విజయరాజరాజేశ్వరి



చినకంచిలో మహాలక్ష్మి



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ ఉత్సవమూర్తులు

పెనమలూరు: లక్ష్మీ స్వరూపమైన వరాల తల్లి వరలక్ష్మికి భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు. శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలను ఆలయాలు, ఇళ్లలో ఘనంగా జరిగాయి. యనమలకుదురులోని పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం చేశారు. భక్తులు చండీహోమం, రుద్రహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారి కల్యాణ మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ నెల 31వ తేదీన శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీ పార్వతీదేవికి గాజుల అలంకరణ చేస్తామని కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి సమేత శ్రీవిజయసుందరేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతం ఘనంగా చేశారు. వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

గన్నవరం: పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కి భక్తులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి వాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో జరిగిన ప్రభ బండ్ల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఐ పి. కనకరావు నేతృత్వంలో పోలీసులు భద్రత చర్యలు తీసుకున్నారు.

నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానం చినకంచిలో కంచి కామక్షిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామికి, అష్టలక్ష్మిలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి పూజలు జరిగాయి. చెరువు సెంటర్లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, బోడపాడు గంగానమ్మ గుడిలో, పాతపాడు శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, పి.నైనవరంలో నాగేంద్రస్వామి ఆలయం, అంబాపురం శ్రీకనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు.

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. పేరంటాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ, మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్ దంపతులు తొలి పూజ కార్యక్రమాన్ని చేశారు. దేవస్థాన ప్రాంగణంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణం జరిగింది.

ఆధునిక వైద్యం అందించాలి




పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కేసరపల్లి(గన్నవరం): ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు పిలుపునిచ్చారు. కేసరపల్లిలో హేమదుర్గ జ్యూయల్ కౌంటిలో శుక్రవారం పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పారిశ్రామికవేత్త కాకర్ల శంకరరావుతో కలిసి పొట్లూరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. స్థానికులు చలసాని సురేష్, ఆర్.శ్రీనివాసరావు, గుత్తా శ్రీనివాసరావు, జాలాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు ఉపసర్పంచ్‌గా రాజా!

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు ఉపసర్పంచ్‌గా వార్డు సభ్యుడు పట్టపు రాజాను ఎన్నుకోనున్నారా అన్న చర్చ గ్రామంలో జరుగుతోంది. పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన తర్వాత గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఒంగూరు పుణ్యవతి 2.5 సంవత్సరాలు, పట్టపు రాజా మరో 2.5 ఏళ్లకు ఉపసర్పంచ్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సమ్మతితో గ్రామ పెద్దలు ఒప్పందానికి వచ్చారు. తొలి విడతలో పుణ్యవతి ఉపసర్పంచ్‌గా 2.5 ఏళ్లు సెప్టెంబరుతో ముగుస్తుంది. శనివారం జరిగే పంచాయతీ పాలక వర్గ సమావేశంలో ఉపసర్పంచ్ ఎన్నికపై పాలకవర్గ సభ్యులు తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

మూడు కిలోల బరువున్న కణితి తొలగింపు



ఆపరేషన్ ద్వారా తొలగించిన కణితి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని సీతామహాలక్ష్మి నర్సింగ్ హోంలో శుక్రవారం ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి మూడు కిలోల బరువున్న కణితిని తొలగించారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం సకల కొత్తపల్లికి చెందిన గండివలస లక్ష్మి అనే మహిళ తరచూ కడుపు నొప్పితో బాధపడుతుండటంతో హనుమాన్‌జంక్షన్‌లోని సీతామహాలక్ష్మి నర్సింగ్ హోంలో డాక్టర్ దుట్టా రామచంద్రరావును సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం కడుపులో కణితి ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. దీంతో శుక్రవారం డాక్టర్ దుట్టా రామచంద్రరావుతో పాటు ఎనస్తీషియన్ డాక్టర్ గాళ్ల రాజేశ్వరరావు శస్త్రచికిత్స నిర్వహించి మూడు కిలోల బరువైన కణితిని బయటకు తీశారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేశారు. కొందరు మహిళల గర్భాశయంలో కణితి(ఫైబ్రాయిడ్) ఏర్పడటం సహజమేనని, మూడు కిలోల బరువైనది ఉండటం అరుదుగా ఉంటుందని డాక్టర్ రామచంద్రరావు చెప్పారు.

అసైన్డ్ భూములకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను లబ్ధిదారుల పేర రిజిస్ట్రేషన్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 2004కు ముందు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల వివరాలను సేకరించాలని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 2004 ముందు ప్రభుత్వం నుంచి భూములను పొందిన లబ్ధిదారులు ఇప్పటి వరకు వారి స్వాధీనంలో ఉన్న భూములకు రాష్ట్ర ప్రభుత్వం వారి పేరున రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారుడు మరణిస్తే వారి పిల్లల పేరున రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. ఈ భూములను వేరే వ్యక్తులకు విక్రయించుకున్న వారికి రిజిస్ట్రేషన్ సదుపాయం ఉండదన్నారు. జాబితాలను రెండు, మూడు రోజుల్లో అందజేయాలని తహసీల్దార్ చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ ఎండీ సలీం, వీఆర్వోలు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో ఏసీ ఫంక్షన్ హాల్

రామవరప్పాడు: పేరంటాలమ్మ ఆలయంలో ఏసీ ఫంక్షన్ హాల్‌గా మార్చిన మొదటి అంతస్తును శుక్రవారం సర్పంచ్ వరి శ్రీదేవి ప్రారంభించారు. ఆలయంలోని అన్నదానం హాలు మొదటి అంతస్తును దాతలు అందించిన ఏసీలతో ఏసీ ఫంక్షన్ హాల్‌గా అభివృద్ధి పరిచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈవో లోకేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒరిగి పడిపోయిన వృక్షం



రామవరప్పాడు: నిడమానూరు మినార్ మసీదు సెంటర్‌లో దశాబ్దాల నాటి జెండా చెట్టు శుక్రవారం పక్కకు ఒరిగి పడిపోయింది. వృక్షం (తురాయి) మొదలు పుచ్చిపోయింది. రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో మట్టి జారి పడిపోయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ముస్లింలు గ్యార్మీ పండుగ, వివాహాది శుభకార్యాలు తదితర కార్యక్రమాల్లో జెండాలను తీసుకొచ్చి ఈ చెట్టుపైనే ప్రతిష్టిస్తారు. రహదారికి అడ్డుగా వృక్షం పడిపోవడంతో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు పారిశుద్ధ్య సిబ్బందితో వాటి కొమ్మలను తొలగించి పక్కకు తీయించారు.

వరిసాగులో యాజమాన్య మెలకువలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వరి సాగులో పాటించాల్సిన యాజమాన్య మెలకులపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి జొన్నల గడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం తిప్పనగుంటలో శుక్రవారం పొలం బడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. వరి పంటలో పొలం పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య కార్యచరణ పరిశోధన అనే అంశాలపై అవగాహన కల్పించారు. పొలంలో నీటి మట్టం స్థాయి, శత్రు పురుగులు, మిత్ర పురుగుల నిష్పత్తి తెలుసుకోవడంపై రైతులకు వివరించారు. పలువురు గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు సెక్షన్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కానూరులో 80 అడుగుల రోడ్డు, టీచర్స్‌కాలనీ, పంటకాలువ రోడ్డు, పోలీస్‌స్టేషన్, ధనేకుల కల్యాణ మండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గన్నవరంలో

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా స్థానిక శ్రీనివాస హేచరీస్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి. హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దావాజిగూడెం, అల్లాపురం, పాముర్తినగర్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, రైస్‌మిల్ బజారు, రాజీవ్‌నగర్, ఎస్బీఐఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డులో విద్యుత్ ఉండదని వివరించారు.

రామవరప్పాడు: నిడమానూరులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరరావు తెలిపారు. రామానగర్, బెస్ట్‌ప్రైస్ ఏరియా, నారాయణపురం కాలనీ సమీప ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డు, కృష్ణానగర్, వేలేరు రోడ్డు, ఐటీఐ రోడ్డు, రైల్వే స్టేషన్ ఏరియాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఏఈ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.